

సిఎం పర్యటన విజయవంతం చేయాలి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పత్తికొండలో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సిఎం పర్యటన పై జిల్లా కలెక్టర్ అధికారులతో బుధవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు, ఆదోని ప్రాంతాల నుండి బస్సు ద్వారా వచ్చే ప్రజలకు పార్కింగ్ ప్రదేశం నుండి సభా ప్రాంగణం వరకు నడిచే దూరం ఎక్కువ లేకుండా చూడాలని జిల్లా ఎస్పి, జాయింట్ కలెక్టర్, ఆదోని సబ్ కలెక్టర్ లకు సూచించారు. సభా ప్రాంగణంలో రోలింగ్ పనులు, రహదారుల ప్యాచింగ్ పనులు, హెలిప్యాడ్ వద్ద పెండింగులో ఉన్న పనులు, రోడ్ మీదికి డ్రైన్ వాటర్ రాకుండా చేయాల్సిన పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్అండ్ బి ఎస్ఇకి కలెక్టర్ ఆదేశించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్ వద్ద పారిశుధ్య పనులను, పిచ్చి మొక్కలు తీసివేయడం, వంటి చర్యలు తీసుకోవాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

సిఎం సారూ.. కష్టాలు కనరా..!

- జిల్లాలో ప్రాజెక్టులకు పడని అడుగులు - నేడు జిల్లాలో సిఎం పర్యటన

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు అడుగులు ఇటుకంతైనా పడడం లేదు. కరువు, వలసలు ఆగడం లేదు. దానికి తోడు జిల్లాలో సమస్యలు కూడా తీవ్రస్థాయిలో ఉన్నాయి. గురువారం పత్తికొండలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఈసారైనా జిల్లా వాసుల కష్టాల వైపు చూస్తారేమో అని జిల్లా వాసులు ఆశతో ఎదురుచూస్తున్నారు..

గతి లేని గుండ్రేవుల

కర్నూలు, కడప జిల్లాలకు మేలు కలిగిలే రూపొందించిన గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన చర్యలేవీ ఇప్పటి వరకూ మొదలు కాలేదు. కర్నూలు జిల్లా సుంకేసుల దగ్గర తుంగభద్ర నదిపై 1.20 టిఎంసిల సామర్థ్యంతో 1865లో అప్పటి పాలకులు సుంకేసుల జలాశయాన్ని నిర్మించారు. ఈ బ్యారేజీకి అనుసంధానంగా కర్నూలు-కడప (కెసి) కాలువ నిర్మించారు. జల రవాణా కోసం నిర్మించిన కాలువను స్వాతంత్ర్యం అనంతరం సాగునీటి కాలువగా మార్చారు. కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్ 31.90 టిఎంసిల నీటి వాటాను కేటాయించింది. దీని పరిధిలో కర్నూలు, కడప జిల్లాలో 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. సుంకేసుల సామర్థ్యం తక్కువ కావడంతో తుంగభద్రకు వరద వస్తేనే కాలువకు సాగునీరు అందుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు సాగునీటి నిపుణులు, విశ్రాంత ఇంజినీర్ సుబ్బరాయుడు సుంకేసుల రిజర్వాయర్ ఎగువన గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి రూపకల్పన చేశారు. కర్నూలు జిల్లాలోని సి.బెళగల్, నందవరం, తెలంగాణలోని రాజోలి ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టును నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. గుండ్రేవుల జలాశయం నిర్మాణం జరిగితే 20 టిఎంసిలు నిల్వ చేయనున్నారు. వరద లేని సమయంలోనూ ఈ నీటిని వాడుకోవచ్చు. గుండ్రేవులకు సంబంధించి గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా శ్రద్ధ పెట్టడం లేదు. వైసిపి ప్రభుత్వం వచ్చాకా ప్రవేశపెట్టిన రెండు బడ్జెట్‌లలోనూ గుండ్రేవులకు నిధులు కేటాయించకపోవడంతో జిల్లా ప్రజల ఆశలు అడిఆశలయ్యాయి.

ఉత్తిపోతలుగానే వేదవతి ఎత్తిపోతలు

కరువుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హెూసళ్లి , సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008 లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు. నిర్వహణలో లోపాలు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి. పథకం ప్రారంభంలో వేసిన గొట్టాలు దెబ్బతిన్నాయి. ఒక్కో ఎత్తిపోతల కింద 500 నుంచి 600 ఎకరాల ఆయకట్టు ఉంది. మరమ్మతులకు నిధులు వెచ్చించి పునరుద్ధరిస్తే తామే వాటిని కొనసాగించుకుంటామని రైతులు వేడుకుంటున్నా పట్టించుకొనేవారు కరువయ్యారు.

వలస నివారణ చర్యలు శూన్యం

ఏళ్లు గడుస్తున్నా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలస వెతలు తప్పడం లేదు. ఉన్న ఊర్లో ఉపాధి లేకపోవడంతో పొట్ట చేతపట్టుకుని ఇతర పట్టణాలకు, నగరాలకు తరలిపోతున్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, హోళగుంద, ఆలూరు, కోడుమూరు మండలాల నుంచి ఈ ఏడాది కూడా వలసలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ, బెంగళూరు, గుంటూరు, ముంబైలకు తరలివెళ్లారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 40వేల మందికి పైగా వలస వెళ్లారు. వలస నివారణకు చర్యలు చేపట్టే అంశాన్ని ఇప్పటి వరకూ ఏ బడ్జెట్‌లో ప్రస్తావించలేదు.

వసతులు లేని కొత్త డివిజన్...

జిల్లా విభజన తరువాత పత్తికొండ రెవెన్యూ డివిజన్ కొత్తగా ఏర్పడింది. ఈ ప్రాంతంలోని రెవెన్యూ పరమైన సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని ఈ ప్రాంత రైతులు, ప్రజలు ఎన్నో కలలుగన్నారు. డివిజన్ ఏర్పాటై ఏడాది పూర్తయింది. నేటికీ సమస్యలు పరిష్కారం కాలేదు. ఆర్‌డిఒ కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు అవసరమైన నిధులు కూడా సమకూరలేదు. తహశీల్దారు కార్యాలయంలోనే రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేసి అక్కడి తహశీల్దారు కార్యాలయాన్ని వందేళ్ల నాటి పాత భవనంలోకి మార్చారు. 2022 ఏప్రిల్ 4న ఆదోని డివిజన్ నుంచి విడిపోయి కొత్తగా ఏర్పాటైన పత్తికొండ డివిజన్లో పత్తికొండ నియోజకవర్గంలోని నాలుగు, ఆలూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలతో కలిసి కొత్తగా పత్తికొండ డివిజన్ ఏర్పడింది.

తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయం



ముఖ్యమంత్రి పర్యటనకు

కట్టుదిట్టమైన భద్రత

- 2 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు

- అప్రమత్తంగా ఉండాలి: ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

వైఎస్ఆర్ రైతు భరోసా కార్యక్రమం సందర్భంగా కర్నూలు జిల్లా , పత్తికొండకు రాష్ట్ర ముఖ్యమంత్రి గురువారం రానున్న నేపథ్యంలో పత్తికొండ సెయింట్ జోసెఫ్ హై స్కూలులో బందోబస్తు నిమిత్తం విచ్చేసిన పోలీసులకు జిల్లా ఎస్‌పి జి. కృష్ణకాంత్ పలు సూచనలు, సలహాలు చేసి దిశా నిర్దేశం చేశారు. ఎస్పి మాట్లాడుతూ పత్తికొండలో ముఖ్యమంత్రి పర్యటించే రూట్ మాప్ - టాప్ ప్రాంతాలలో, సిఎం కాన్వాయ్, హెలిపాడ్, బహిరంగ సభ సమావేశ ప్రాంగణం , తదితర ప్రాంతాలలో బందోబస్తు విధులు నిర్వహించే స్పెషల్ పార్టీ పోలీసు బందాలు , పోలీసు జాగిలాలు, బాంబ్ స్క్వాడ్ బందాలతో పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా భద్రత పరంగా పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. సున్నితంగా వ్యవహరించాలన్నారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. చేయకూడని, చేయవలసిన వాటికి గురించి తెలిపారు. అనంతరం సిఎం కాన్వాయ్ రిహార్సల్స్‌ను, హెలిప్యాడ్, ముఖ్యమంత్రి బహిరంగ సభ వద్ద భద్రత ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా ఎస్‌పి జి.కృష్ణ కాంత్ కలిసి పరిశీలించారు. నలుగురు అడిషనల్ ఎస్‌పిలు , 19 మంది డిఎస్‌పిలు, 57 మంది సిఐలు, 119 మంది ఎస్ఐలు, 473 మంది ఎఎస్ఐలు / హెడ్ కానిస్టేబుళ్ళు , 815 మంది కానిస్టేబుళ్ళు , 70 మంది మహిళా పోలీసులు, 396 మంది హోంగార్డులు, 02 సెక్షన్ల ఎఆర్ సిబ్బంది, 02 స్పెషల్ పార్టీబృందాలను బందోబస్తు విధులకు కేటాయించారు. జిల్లా ఎస్‌పితో పాటు సెబ్ అడిషనల్ ఎస్‌పి కృష్ణకాంత్ పటేల్, అడిషనల్ ఎస్‌పిలు, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు , పోలీసు సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

జిల్లా అభివృద్ధికి

రూ.10 వేల కోట్లు కేటాయించాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం జిల్లా కమిటీ విజ్ఞప్తి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా జిల్లా అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్ల నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం జిల్లా అభివద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోలేదని తెలిపారు. ప్రజలను నమ్మించి జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో వైసిపి ఎమ్మెల్యేలను, ఎంపీలను ప్రజల ఓట్ల ద్వారా పొందిన వైసిపి అధికారం చేపట్టిందని తెలిపారు. తర్వాత జిల్లా అభివృద్ధి గురించి కనీసం మాటమాత్రంగా కూడా మాట్లాడకపోవడం దుర్మార్గమైన చర్య అని ఆయన విమర్శించారు. గతంలో ఎన్నికల ముందు హడావిడిగా గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టుల నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన టిడిపిపై విమర్శ చేసి అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం నిధులు కేటాయించకుండా కర్నూలు జిల్లాను శాశ్వత కరువు జిల్లాగా మార్చే ప్రయత్నం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాల పునర్విభజన తర్వాత అత్యంత వెనుకబడిన జిల్లాగా కర్నూలు జిల్లా ఉందని, ఒక్క సాగునీటి ప్రాజెక్టు, ఒక్క పరిశ్రమ జిల్లాలో లేకపోవడం పాలక ప్రభుత్వాల నిర్లక్ష్యమని విమర్శించారు. ఓర్వకల్లులో ఐటి హబ్ ఏర్పాటు చేస్తానన్న ముఖ్యమంత్రి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఈ నాలుగేళ్ల కాలంలో స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు జిల్లా అభివృద్ధి గురించి అసెంబ్లీలో, ముఖ్యమంత్రి దగ్గర ప్రస్తావించిన పాపాన పోలేదన్నారు. జిల్లాలో ఆర్థిక మంత్రి ఉన్నా నిధులు మాత్రం జిల్లాకు శూన్యంగానే మిగిలిందని తెలిపారు. న్యాయ రాజధాని పేరుతో మహాగర్జన చేసి గగ్గోలు పెట్టిన వైసిపి నాయకులు ఇప్పుడు రాజధాని గురించి ఏం సమాధానం చెబుతారో ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. పత్తికొండలో పర్యటన చేసే ముఖ్యమంత్రి పత్తికొండ బహిరంగ సభలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం ప్రకటన చేయాలని, జిల్లా అభివృద్ధి కొరకు సాగు, తాగునీరు ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.10వేల కోట్ల నిధులు మంజూరు చేసే విధంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే ప్రజలు రాబోయే ఎన్నికల్లో వైసిపికి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు ప్రజల తాగునీటి సమస్యకు శాస్వత పరిస్కారం చూపామని కర్నూలు, నంద్యాల ఎంపీలు, ఎమ్మెల్యేలు , మేయర్ తెలిపారు. గత ఏడాది మే 28న మునగాలపాడు పంప్ హౌస్ వద్ద శంకుస్థాపన చేసిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ అధునాతన హంగులతో బుధవారం కర్నూలు, నంద్యాల ఎంపీలు డాక్టర సంజీవ్ కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు హాఫీజ్ ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జరదొడ్డి సుధాకర్, నగర మేయర్ బివై.రామయ్య, కమిషనర్ ఎ.భార్గవ్ తేజ ప్రారంభించారు. రూ.37.5 లక్షలతో నంద్యాల ఎంపీ ల్యాండ్స్ కింద కొనుగోలు చేసిన జెసిబిని ప్రారంభించారు. మేయర్ బివై.రామయ్య మాట్లాడుతూ రూ.15.10 కోట్లతో దాదాపు 1.10 లక్షల మందికి సరిపడా నీటిని అందించే సామర్థ్యం గల ఈ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఎక్కడా ఆలస్యం కాకుండా ఏడాదికే దిగ్విజయంగా పూర్తి చేశామని చెప్పారు. ఎకరన్నర స్థలంలో నీటిశుద్ధి కేంద్రం, ఆలమ్‌ట్యాంక్, రసాయనహౌస్, బై-పాస్‌ఛానల్, ఏరేటర్లను నిర్మించామన్నారు. నగరపాలక సంస్థకు పాలకవర్గం వచ్చిన రెండేళ్లలోనే రూ.225 కోట్ల తాగునీటి సరఫరాకు ఖర్చు చేశామన్నారు. అందులో రూ.115 కోట్లతో గోరుకల్లు వద్ద సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, నగరంలో 21 వాటర్ ట్యాంకుల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, త్వరలో శంకుస్థాపన చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వివిధ దశల్లో ఉన్న తాగునీటి ప్రాజెక్టులు వచ్చే వేసవికి పూర్తి అవుతాయని, తద్వారా భవిష్యత్తులో కూడా కర్నూలు నగరంలో తాగునీటి ఎద్దడి ఉండబోదన్నారు. ఎంపిలు సంజీవ్ కుమార్, పోచా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల నిధులను కర్నూలు నగరపాలక సంస్థ సమర్థవంతంగా వినియోగించుకుం దని కొనియాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల అవసరాలను చాలా చక్కగా తీరుస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యేలు హాఫీజ్, కాటసాని, సుధాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కర్నూలు నగరాన్ని విస్మరించిందని, తద్వారా అనేక సమస్యలు ప్రజలు ఎదుర్కొన్నారని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల, అధికారుల ఆలోచనలను ప్రతిపాదనలను గౌరవించి రూ.వందల కోట్లు నగరాభివృద్ధికి ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజల తాగునీటి సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్లాంట్ ఆలస్యం చేయకుండా, త్వరితగతిన పనులు చేశామన్నారు. సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు రూ.82 కోట్లతో నిర్మిస్తున్న పనులు శరవేగంగా జరుగుతున్నా యని, మరో నాలుగు నెలల్లో వాటిని ప్రారంభిస్తామన్నారు. డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన ఎంఇ. శేషసాయి, డిఇఇ రవిప్రకాష్ నాయుడు, ఎఇ జనార్ధన్, ప్లాంట్ నిర్మాణ పరిశీలకుడు మస్తాన్ వలీలను మేయర్, కమిషనర్ శాలువాలతో సత్కరించి అభినందించారు.



వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు



క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

క్రీడా సాధనతో ఆరోగ్యం పదిలం : డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

విద్యార్థులు క్రీడా సాధనతో ఆరోగ్యం పెంపొందించుకోవాలని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ పోషకులు డాక్టర్ బి.శంకర్‌శర్మ వ్యాఖ్యానించారు. బుధవారం కర్నూలు బుధవారపేట బిఆర్ అంబేద్కర్ స్టేడియంలో జైభీమ్ దళిత వికాస సంఘం ఆధ్వర్యంలో స్కై మార్షల్ ఆర్ట్స్ శిక్షణ శిబిరం ముగింపులో డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడారు. మురికివాడల ప్రాంతాల్లో పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడల సాధన అవసరమన్నారు. ఈ చిన్నపాటి గ్రౌండ్లో ప్రతిరోజు గంటపాటు క్రీడల సాధన చేసి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కోచింగ్ క్యాంపులో పాల్గొన్న చిన్నారులందరికీ పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం అధ్యక్షులు బి.రామాంజనేయులు, జిల్లా స్కై మార్షల్ ఆర్ట్ ప్రధాన కార్యదర్శి నబీసాహెబ్, జైభీమ్ దళిత వికాస సంఘం ప్రతినిధులు జె.శ్రీనివాసులు, బాలకృష్ణ, నాగేంద్ర,నాగరాజు, భాస్కర్, కృష్ణ, సుకూర్మియా తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు చిన్నారులు స్కై ఆర్ట్స్ ప్రదర్శన చేసి పలువురిని అబ్బురపరిచారు.

పండ్ల తోటల సదస్సులను విస్తృతం చేయండి

ప్రజాశక్తి- సి బెళగల్

పండ్ల తోటల పెంపకంపై గ్రామాల్లో అవగాహన సదస్సులను విస్తతం చేయాలని ఎంపిడిఒ రాముడు సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. బుధవారం గుండ్రేవులలో సచివాలయం తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. ఐదేకరాల లోపు రైతుల జాబితా తయారు చేసి ఆసక్తి కలిగేలా దృష్టి సారించాలని మంచి లాభదాయకమేనని అన్నారు.

పశుబీమా పథకంపై పాడిరైతులకు అవగాహన

ప్రజాశక్తి- సి బెళగల్



పశు బీమాపై అవగాహన పెంచుకోవాలని పశువైద్యాధికారి ప్రవీణ్ పేర్కొన్నారు. బుధవారం సి.బెళగల్ లో పాడి రైతుల ఇంటింటికి వెళ్లి పశు బీమాపై అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రతి రైతు ప్రతి పాడి పశువుకు బీమా చేసుకోవడం వలన ఏదేని సందర్భంగా అనారోగ్యంతో, జబ్బుతో, సీజనల్ వ్యాధులతో మరణిస్తే రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని అన్నారు. మరిన్ని వివరాలకు పశువైద్యులను, సిబ్బందిని సంప్రదించాలని రైతులకు సూచించారు.

దళితులకు నివాసయోగ్యం కల్పించండి

ముఖ్యమంత్రి స్పందించి తొలగించకుండా ఆపండి

కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు

ప్రజాశక్తి-పత్తికొండ

దళిత వృత్తి దారులైన కాటికాపారులు, చర్మకారులు, డప్పు కళాకారులకు నివాస యోగ్యం కల్పించేలా ముఖ్యమంత్రి స్పందించాలని కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు కోరారు. బుధవారం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో పత్తికొండ పట్టణంలోని సర్వేనెంబర్ 95లో దళితులు నివాసం ఉన్న కాలనీలను కెవిపిఎస్ నాయకులు సందర్శించారు. అనంతరం కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. ఆనంద్ బాబు, జిల్లా సహాయ కార్యదర్శి గిత్తరి రమేష్, మాట్లాడారు. డప్పు కళాకారుల పేదలు ఇళ్ల స్థలాల పట్ల ముఖ్యమంత్రి ప్రేమతో ఆలోచించి అధికారుల ద్వారా నివాస పట్టాలు మంజూరు చేయించాలన్నారు. సమాజమంతటికి ఉపయోగ పడే వృత్తులను చేస్తున్న దళితులు నేటికి అంటరాని వాళ్ళుగానే చూడబడుతున్నారన్నారు. సచ్చిన ప్రతి ఒక్కరిని కుళ్ళిన, ఉబ్బినా, రోగమున్న వారినైనా సరే పాడెగట్టి పూడ్చే, కాల్చే కాటి కాపారులను నేటికీ కనీసం వృత్తి దారులుగా కూడా గుర్తించడం లేదన్నారు. ఇప్పటికైనా వారిని 4వ తరగతి ఉద్యోగాలుగా గుర్తించాలన్నారు. అదేవిధంగా దళిత వత్తి దారులు వేసుకొంటున్న నివాసులకు హక్కు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాటికాపరి గుంతలు తీసే బేగరుల సంఘం జిల్లా కార్యదర్శి ఎన్ జి కృష్ణ, దళిత మహిళా సంఘం జిల్లా కన్వీనర్ డి.విజయమ్మ, స్కావేంజర్స్ కార్మిక హక్కుల పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ఆంధ్ర గురుస్వామి, చర్మకార వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు ఎన్ చక్ర పాణి, అడివప్ప, పెద్దయ్య, చిన్న సంజీవ, రంగన్న, నాగరాజు, ఆంజనయ్య, ఈరన్న, వెంకట రంగయ్య, కష్ణమ్మ, నాగలక్ష్మి, మంగమ్మ, రాఘవేంద్రమ్మ, అంజినమ్మ, హనుమంతమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు

పకడ్బందీగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు : డిఆర్ఒ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌వి.నాగేశ్వర రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం డిఆర్ఒ ఛాంబర్ లో పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ పై సంబంధిత అధికారులతో జిల్లా రెవెన్యూ అధికారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 2వ తేది నుంచి జూన్ 10వ తేది వరకు ఉదయం 9:30గం.ల నుంచి మ.12:45గం.ల వరకు 61 పరీక్ష కేంద్రాలలో 11,535 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. పరీక్షల నిర్వహణలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రంగారెడ్డిని డిఆర్ఒ ఆదేశించారు. పరీక్ష కేంద్రంలోనికి విద్యార్థులతో పాటు విధులు నిర్వహించే సిబ్బంది కూడా ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు,మొబైల్ ఫోన్స్ తీసుకెళ్లకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ అధికారులు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయడంతో పాటు బందోబస్తు కల్పించాలన్నారు. దూర ప్రాంతాల విద్యార్థులకు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలకు సరైన సమయంలో చేరేందుకు బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖాధికారి రంగారెడ్డి మాట్లాడుతూ పరీక్షలు సజావుగా నిర్వహించుటకు 61 మంది చీఫ్ సూపరింటెండంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 03, ఇన్విజిలేటర్స్ 610 మందికి విధులు కేటాయించడంతో పాటు స్టోరేజ్ పాయింట్స్ 27 గుర్తించామని వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ (పరీక్షలు) చంద్రభుషణం, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ ఎస్‌వి.నాగేశ్వరరావు

పీజీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూని వర్సిటీ పరిధిలోని పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ ఫలితాలను బుధ వారం వైస్ ఛాన్సర్ ఆనందరావు విడుదల చేశారు. రెగ్యులర్ కింద 521 మంది విద్యార్థులు హాజరు కాగా482 మంది ఉత్తీర్ణులయ్యారు. సప్లమెంటరీ కింద 214 మందికి గాను 163 మంది ఉత్తీర్ణులయ్యారు

వేసవిశిక్షణలో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్



వేసవి శిక్షణ శిబిరాల ద్వారా చిన్నారుల్లో మానసిక వికాసం, ఉల్లాసం చైతన్యం కలిగించవచ్చునని ఫుడ్ కార్పొరేషన్ రిటైర్డ్ మేనేజర్ చంద్రశేఖరప్ప అన్నారు. బుధవారం సాయంత్రం కర్నూలు టిజివి కల్చర్ అకాడమీ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబు లయ్య స్వాగతం పలుకుతూ ప్రతి సంవత్సరం వేసవిలో శాస్త్రీయ సంగీతం, నత్యం, పాశ్చాత్య నృత్యం, చిత్రలేఖనం వంటి అంశాల్లో చిన్నా రులకు శిక్షణ ఇప్పించి ముగింపుగా వారి ప్రదర్శనను ఏర్పాటు చేస్తా మన్నారు. అదేవిధంగా పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. ఈ సంవత్సరం నాలుగు విభాగాల్లో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. చిన్నారులు నేర్చుకున్న అంశాలను ప్రదర్శించారు. చంద్రశేఖరప్ప, పత్తి ఓబులయ్య వారికి ప్రశంసా పత్రాలతో పాటు గురువులకు సత్కారం చేశారు. కార్యక్రమంలో గురువులు నాట్యాచార్య కరీముల్లా, నాగరాజు, పి.సుజాత, బి.వెంకటరమణ పాల్గొన్నారు.

'సిఎం సభకు భారీగా తరలించండి'

ఉద్యోగులకు అధికారులు హుకుం జారీ...

ప్రజాశక్తి-తుగ్గలి : నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండలో నేడు జరుగుతున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి సభకు ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలను భారీగా తరలించాలని మండల స్థాయి అధికారులు బుధవారం వివిధ శాఖల ఉద్యోగులకు హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం 118 బస్సులను సభకు మంజూరు చేసింది. ఒక్కో బస్సులో 48 మంది చొప్పున మండలంలో 5600 మందిని తరలించాలని ఇప్పటికే ఆయా శాఖల ఉద్యోగులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. బస్సు నిండక పోతే కేటాయించిన ఉద్యోగులపై చర్యలు తీసు కుంటామని మండలస్థాయి అధికారులు హెచ్చరించినట్లు సమాచారం. ఇప్పటికే ఆయా గ్రామాలకు చెందిన బడా, చోట నాయకులు సచివాలయం ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రజలను తరలించే బాధ్యత ఉద్యోగులు తీసుకోవాలని సచివాలయం ఉద్యోగులను ఆదేశించారు.

మున్సిఫ్ కోర్టు కాంపౌండ్‌లో నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మైపర్ డైరెక్టర్,కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఆదిమూలపు సతీష్ , జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సంయుక్తంగా మున్సిఫ్ కోర్టు కాంపౌండ్‌లోజూన్ 1న గురువారం ఉదయం 10 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్ఫర్మేషన్‌కమిషనర్లు ఉల్చాలహరిప్రసాద్‌రెడ్డి, కాకర్లచెన్నారెడ్డి ప్రారం భిస్తారు. ఈ శిబిరంలో ఈఎన్‌టి వైద్య నిపుణులు డాక్టర్ హరికృష్ణారెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ కె. కిరణ్మయి, ఎండోక్రైనాలజీ నిపుణులు డాక్టర్ బి. భారతి, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సంజీవ్‌కుమార్, జనరల్ మెడిసిన్ డాక్టర్ అమతసాయిలు రోగులను పరీక్షిస్తారని చెప్పారు. ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఆదిమూలపు సతీష్ తెలిపారు.

కొలతల్లో తేడాలుంటే తెలపాలి

- జిసిడిఒ సునీత - జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్ తనిఖీ

ప్రజాశక్తి - గోనెగండ్ల



రికార్డులు తనిఖీ చేస్తున్న జిసిడిఒ సునీత

జగనన్న విద్యా కానుకలో కొలతల్లో తేడాలుంటే తెలపాలని జిసిడిఒ సునీత తెలిపారు. బుధవారం గోనెగండ్ల జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను ఆమె తనిఖీ చేశారు. బస్టాండ్ వెనుక పాఠశాల స్టాక్ పాయింట్‌ను పరిశీలించి క్వాలిటీ వాల్ స్టాల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలోని 11,872 మంది విద్యార్థులకు సంబంధించి స్టాక్ పాయింట్‌కు చేరిన షూస్, యూనిఫారం, డిక్షనరీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించామని తెలిపారు. అలాగే సంబంధిత సిబ్బంది షూస్‌కు సంబంధించిన సైజులను కొలతల మేరకే ఉన్నాయా లేదా నిర్ధారించి తమకు తెలియజేస్తే కొలతలు సరిగా లేకపోతే వెనక్కి పంపి విద్యార్థులకు అవసరమైన కొలతల మేరకు తిరిగి తెప్పిస్తామని వివరించారు. సిఆర్‌పిలు పుల్లన్న, రవికుమార్, విజయ, రాణి, చెన్నకేశవులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం



ప్రజాశక్తి - హాలహార్వి

పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి నెట్టికంటమ్మ అధ్యక్షతన ఎంపిడిఒ ఆంథోని అధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి లింగప్ప మాట్లాడారు. మండలంలోని ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని మండలంలో అన్ని గ్రామాలకూ తాగునీరు సరఫరా చేయాలని నీటిపారుదల అధికారులను కోరారు. బేవినహల్, కొక్కరచేడు సర్పంచులు మాట్లాడుతూ... తమ గ్రామాలకు నీటి సమస్య ఎక్కువగా ఉందని తెలిపారు. దాదాపు 25 రోజుల నుంచి నీళ్లు రాలేదని, తాత్కాలికంగానైనా నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని కోరారు. అలాగే శాశ్వత పరిష్కారం కింద చింతకుంట చెరువు వెడల్పు పెంచాలని తెలిపారు. లేకపోతే కొత్త చెరువు నిర్మించాలని కోరారు. ఎఒ శివశంకర్ మాట్లాడుతూ... మండలంలో రైతు భరోసా కింద రూ.5500, పిఎం కిసాన్ రూ.2 వేలు రైతుల ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. ఐసిడిఎస్ అధికారి చంద్రావతి మాట్లాడుతూ... మండలంలో కొత్తగా 4 భవన నిర్మాణ కేంద్రాలకు ప్రపోజల్ వచ్చాయని తెలిపారు. డిటి బ్రహ్మయ్య మాట్లాడుతూ... భూ రీసర్వేకు అందరూ సహకరించాలని కోరారు. అధికారులందరినీ వారివారి విభాగాల్లో సమస్యలపై ప్రశ్నించారు. వైస్ ఎంపిపి నాగేష్, ఇఒఆర్‌డి మల్లికార్జున, ఎపిఒ శ్రీనివాసులు, వెటర్నరీ డాక్టర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

- మండల వైద్యాధికారి ఆశాజ్యోతి

ప్రజాశక్తి - పెద్దకడబూరు



సిబ్బందితో మాట్లాడుతున్న ఆశాజ్యోతి

మండలంలోని వివిధ గ్రామాల్లో పని చేసే ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు విధులను సక్రమంగా నిర్వర్తించాలని మండల వైద్యాధికారి ఆశాజ్యోతి ఆదేశించారు. బుధవారం పెద్దకడబూరులోని 5వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తమ తమ గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వివిధ రకాలైన వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, అలాగే ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహించి రోగులను గుర్తించాలని సూచించారు. పెద్దకడబూరులో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఆశా వర్కర్లు డిఎంహెచ్‌ఒకు సరెండర్ చేశామని తెలిపారు. గతంలో ఈమెకు మెమోలు కూడా జారీ చేసినా మారలేదని, అందుకే సరెండర్ చేశామని చెప్పారు. ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పని చేస్తున్న గ్రామాల్లోనే నివాసముండి ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిమిషాల్లోనే ముగించేశారు..!

- తూతూమంత్రంగా కౌన్సిల్ సమావేశం - పెళ్లిళ్లు ఉన్నాయంటూ బుకాయింపు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి పరిష్కార దిశగా కృషి చేయాల్సిన కౌన్సిల్ ప్రాధాన్యత కోల్పోతోంది. ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతుంటే ప్రజా సమస్యలపై నెలకోసారి చర్చించాలని రాజ్యాంగంలో పేర్కొన్నా ప్రజల చేత ఎన్నుకోబడిన ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, కౌన్సిల్ సభ్యులు మాత్రం ప్రజా సమస్యల కంటే పెళ్లిళ్లు, ఫంక్షన్లకే అధిక ప్రాధాన్యత ఇస్తూ కౌన్సిల్ సమావేశాన్ని 10 నిమిషాల్లోనే ముగించి వెళ్లిపోయారు. బుధవారం మున్సిపల్ ఛైర్మన్ బోయ శాంత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశానికి ముందు కోరం లేదని ఛైర్మన్, కౌన్సిలర్లు, వైస్ ఛైర్మన్, మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు అరగంట సేపు వేచి ఉన్నారు. కోరం మేరకు సభ్యులు రావడంతో సమావేశాన్ని ప్రారంభించి అజెండాలోని అంశాలపై చర్చ విషయం అటుంచితే కనీసం అజెండాపై కూడా పూర్తిగా అధికారులను చదవనివ్వకుండానే అన్ని 'పాస్.. పాస్...' అంటూ కౌన్సిల్ సమావేశాన్ని 10 నిమిషాల్లోనే ముగించి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు రికార్డు సృష్టించారు. పట్టణం లోని ఏరియా ఆస్పత్రిలో తేలుకాటుకు గురై ఒక బాలుడు మృతి చెందినా దానిపై చర్చించకుండా పట్టణంలో ఎలాంటి సమస్యలూ లేవంటూనే కౌన్సిల్ సమావేశాన్ని ముగించారు. తమకు పెళ్లిళ్లు, ఇతర ఫంక్షన్లు ఉన్నాయంటూ ఛైర్మన్ శాంతతో పాటు ఇతర కౌన్సిల్ సభ్యులు, వైస్ ఛైర్మన్లు గౌస్, నరసింహులు సమావేశాన్ని ముగించారు. మున్సిపల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి కౌన్సిల్ సమావేశంలో అజెండా చదువుతుండగానే అన్ని 'పాస్.. పాస్...' అంటూ సభ్యులు ఆమోదం తెలిపారు. తాను నాలుగు సార్లు కౌన్సిలర్‌గా గెలుపొందానని, ప్రతిసారీ సమావేశాల్లో చర్చ ఉంటుందని, తన జీవితంలో ఇంత త్వరగా ఇంత ప్రశాంతంగా ఎలాంటి చర్చ లేకుండా సమావేశం ముగించడం గర్వించదగ్గ విషయమని సీనియర్ కౌన్సిలర్ వైజి.బాలాజీ సమావేశం నుంచి వెళ్లిపోయారు. పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉందని, దానిపై కూడా చర్చించుకోవడంపై, దానిని ప్రస్తావించేందుకు కూడా అవకాశం ఇవ్వకపోవడంపై కొంతమంది కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం కౌన్సిల్ హాజరు కోసమే, జీతం కోసమే వచ్చినట్లు అయిందని మరి కొంతమంది కౌన్సిలర్లు పేర్కొన్నారు. ఎలాగో కౌన్సిల్‌లో తమ సమస్యలు చర్చించలేదని, కనీసం సమావేశం తర్వాత అయినా చర్చించేందుకు అవకాశం ఇవ్వాలని కౌన్సిలర్లు రాజేశ్వర్ రెడ్డి, మరికొందరు ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె తన ఛాంబర్‌లోకి వచ్చి చర్చించాలని పేర్కొన్నట్లు కౌన్సిలర్లు సమాచారం ఇస్తూ ఛాంబర్‌కు బయల్దేరారు. గత కౌన్సిల్ సమావేశం వరకు అనేక సమస్యలపై గళం విప్పిన అధికార పార్టీ కౌన్సిలర్లు ఈ సమావేశంలో ఒక్క సమస్యపై కూడా చర్చించలేదు. చివరకు ఎస్ఎస్ ట్యాంకులో తాగునీరు ఉన్నాయా అనే విషయంపై కమిషనర్ రఘునాథ్ రెడ్డి దృష్టికి పత్రికా విలేకరులు తీసుకెళ్లారు. ఇంకా రెండు నెలలకు సరిపడే తాగునీరు బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో నిల్వ ఉన్నాయని, ఎలాంటి నీటి సమస్య ఉండదని ఆయన తెలిపారు. కౌన్సిల్ సమావేశాన్ని ముగించిన వైస్ ఛైర్మన్ ఎంఎంజి.గౌస్, నరసింహులు, కౌన్సిలర్లు చలపతి, బాలాజీ, ఫయాజ్ అహ్మద్ తదితరులు కౌన్సిల్ హాలులోనే పిచ్చాపాటిగా చర్చించుకున్నారు. ఇదే చర్చ ప్రజా సమస్యలపై అధికారుల సమక్షంలో జరిగి ఉంటే పట్టణ ప్రజలకు కొంతవరకైనా మేలు జరిగేదని పలువురు పేర్కొన్నారు. డిప్యూటీ ఇంజినీర్ వెంకట చలపతి రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ అస్లాం బాష, అసిస్టెంట్ ఇంజినీర్లు కృపాకర్, రాజశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు శాంతి, పార్వతి, అశోక్, చిన్న, ఉస్మాన్, మీనుగా మహాలక్ష్మి, ఇందు, మహేశ్వరి, సురేష్, ఇంతియాజ్, వసీం, కో ఆప్షన్ సభ్యులు తిమ్మక్క ఉన్నారు.



మాట్లాడుతున్న ఛైర్మన్ శాంత



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

వైభవంగా అమ్మవార్ల విగ్రహ ప్రతిష్టాపన

- తిమ్మాపురంలో భక్తిశ్రద్ధలతో ఎల్లమాంబ దేవి, చౌడేశ్వరి దేవి విగ్రహాల ప్రతిష్టాపన

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని నగరడోన పంచాయతీలోని మజరా గ్రామమైన తిమ్మాపురంలో అమ్మవార్ల విగ్రహ ప్రతిష్టాపనను వైభవంగా నిర్వహించారు. బుధవారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బెల్డోన రామనాథ శాస్త్రి స్వామి సమక్షంలో వేద పండితులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం వేకువ జామున భక్తిశ్రద్ధలతో ఎల్లమాంబ, చౌడేశ్వరి దేవి విగ్రహాల ప్రతిష్టాపన చేపట్టారు. గత మూడు రోజుల నుంచి గ్రామంలో భక్తశ్రద్ధలతో మహిళలు పెద్ద ఎత్తున 101 కలశాలు, విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. ఇంటికొచ్చిన ఆడకూతుళ్లకు ఒడి బియ్యం నిర్వహించుకున్నారు. విగ్రహ ప్రతిష్టాపనకు చుట్టుపక్కల గ్రామ ప్రజలతోపాటు దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైసిపి ఆలూరు ఇన్‌ఛార్జీ నారాయణస్వామి, ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ, సర్పంచి నాగేంద్ర, వైసిపి నాయకులు హేమంత్, ఎపిఒ మాధవ శంకర్ హాజరయి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు, ప్రజలకు అన్నదానం ఏర్పాటు చేశారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న ప్రజా ప్రతినిధులు

మహానాడు సాక్షిగా బృహత్తర పథకాలు

- టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

రాజమండ్రిలో జరిగిన మహానాడు సాక్షిగా టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు బృహత్తర పథకాలతో టిడిపి మేనిఫెస్టో ప్రకటించారని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. బుధవారం టిడిపి కార్యాలయంలో ఎన్‌టి.రామారావు, చంద్రబాబు నాయుడు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1500, తల్లికి వందనం పథకం కింద ప్రతి ఇంట్లో ఎంతమంది చదువుతుంటే అంతమంది పిల్లలకు ఏడాదికి రూ.15 వేలు, దీపం పథకం కింద ప్రతి కుటుంబానికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం కింద మహిళలకు టికెట్ లేని ప్రయాణం కల్పించడం వంటి బృహత్తర పథకాలను మహానాడు వేదిక సాక్షిగా ప్రవేశ పెట్టడం సంతోషకరమని చెప్పారు. అన్నదాత పథకం కింద రాష్ట్రంలోని ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సహాయం, నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు, ప్రతి నిరుద్యోగికీ యువగళం నిధి కింద నెలకు రూ.3వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. నాయకులు దొడ్డనగేరి శివప్ప, వాల్మీకి వెంకటేష్, రామకృష్ణ, సజ్జాద్, రామాంజనేయులు, మాజీ కౌన్సిలర్ బాలాజీ, దుబ్బనకల్లు లక్ష్మణ్, మల్లికార్జున, మహిళా నాయకులు పాల్గొన్నారు. **నందవరం** కోట వీధిలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవ్ రావు దేశాయి మహిళలు, రైతులతో కలిసి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేయించారు. టిడిపి నాయకులు షరీఫ్, ఇషా, ఈరన్న, మల్లికార్జున, శీను, మోహన్, పంపయ్య పాల్గొన్నారు.



ఆదోనిలో పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు



నందవరంలో పాలాభిషేకం చేస్తున్న మాధవ రావు దేశాయి, మహిళలు



నిలిచిన వాహనాలు

తెగిపడిన తీగలు

- స్తంభించిన వాహనాలు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని భీమాస్ సర్కిల్‌లో కేబుల్ వైర్లు తెగి రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనాలు బారులుదీరాయి. వాటిని సరి చేయాల్సిన నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బుధవారం సాయంత్రం ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మన్న స్పందించి వైర్లను సరి చేయించడంతో సమస్య తీరింది. కేబుల్ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా అక్కడక్కడ విద్యుత్ స్తంభాల వద్ద వైర్లు తెగి రోడ్డుకు అడ్డంగా ఉన్నా సరి చేయకపోవడంతో విద్యుత్ సరఫరా అయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కేబుల్ నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేయాలని కోరుతున్నారు.

మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న



మాట్లాడుతున్న ఈరన్న

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులను, ఉద్యోగులను ఐక్యం చేసేందుకు రాష్ట్ర మున్సిపల్ బస్సు ప్రచార జాతాను మున్సిపల్ ఉద్యోగ, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గంటలో ముగిసిన సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - నందవరం

ఈనెల 1న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన ఉన్నందున అధికారులు మండల సర్వసభ్య సమావేశాన్ని గంటలో ముగించారు. బుధవారం ఉదయం 11.30 మొదలు పెట్టి 12.30 నిమిషాలకు ముగించారు. ఆయా శాఖల అధికారులు పురోగతిని వివరించారు. ఎంపిపి లక్ష్మీ దేవమ్మ, ఎంపిడిఒ కృష్ణమూర్తి, వైసిపి నాయకులు శివారెడ్డి గౌడ్, విరుపాక్షి రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి లక్ష్మీ దేవమ్మ

సెల్ఫీ వీడియోలో మాట్లాడుతూ...
రైలు కింద పడి యువకుని ఆత్మహత్య....

ప్రజాశక్తి - ఆదోని



ఆదోని మండలం పెద్దతుంబలం గ్రామానికి చెందిన యువకుడు హుస్సేన్ పీరా (32) ఇస్వీ రైల్వే స్టేషన్ సమీపంలో సెల్ ఫోన్‌లో సెల్ఫీ వీడియో మాట్లాడుతూ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం ఉదయం ఈ సంఘటన చోటుచేసుకోగా సెల్ఫీ వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. మృతుని వివరాలు రైల్వే పోలీసులకు తెలియక ముందే సెల్ ఫోన్‌లో వీడియోలు హల్‌చల్ చేయడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అసలు ఈ వీడియో ఎవరిది, ఎక్కడ జరిగిందనే విషయంపై అనేకమంది విలేకరులకు ఫోన్ చేస్తూ విచారించారు. మండలంలోని పెద్దతుంబలం గ్రామానికి చెందిన మృతుడు ఖాసీం పీర్ అని, రైలు పట్టాలపై పడుకుని తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలియడంతో అందరూ విచారం వ్యక్తం చేశారు. సెల్ఫీ వీడియోలో మాట్లాడుతూ ఆత్మహత్యకు పాల్పడినట్లు పెద్దతుంబలం ఎస్ఐ జీపు డ్రైవర్‌గా పనిచేస్తున్న హుస్సేన్ పీరా ఇస్వీ గ్రామం దగ్గరకొచ్చి రైలు కిందపడి మృతి చెందాల్సిన అవసరం, బాధలు, బాధ్యతలు ఏం ఉన్నాయో అన్న అనుమానం అందరూ వ్యక్తం చేస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు సమాచారం. రైల్వే పోలీసుల సమాచారం మేరకు మృతుడు తనకున్న తీవ్రమైన కడుపు నొప్పి భరించలేక, జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని, భార్య ఖాజాబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆదోని రైల్వే ఎస్ఐ రామస్వామి తెలిపారు. పెద్దతుంబలం గ్రామస్తుల సమాచారం మేరకు మృతుడు హుస్సేన్ పీరాకు కుటుంబ కలహాలు ఎక్కువయ్యాయని, ఆ ఒత్తిడి వల్లే ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని వివరించారు. అలాగే పోలీసు శాఖలో జీపు డ్రైవర్‌గా పని చేస్తూ ఆత్మహత్యకు పాల్పడాల్సిన అవసరం ఏముందని, దీనిపై ఎస్పీ సమగ్రంగా విచారణ చేయించాలని, హుస్సేన్ పీరా ఆత్మహత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

మాలల విద్యాభివృద్ధితోనే చైతన్యం

- మాలల సింహగర్జన మహాసభలో నాయకులు...

ప్రజాశక్తి-ఆలూరు

మాలల విద్యాభివృద్ధితోనే చైతన్యం కాగలరని తెలంగాణ మాలమహానాడు అధ్యక్షులు నరసింహం తెలిపారు. బుధవారం ఆలూరు వాసవీ కల్యాణ మండపం ఆవరణలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది అధ్యక్షతన మాల మహానాడు సింహగర్జన మహాసభ నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వక్తలు చలవారి మహాసభ బళ్లారి జిల్లా అధ్యక్షులు నర్సప్ప, మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య మనువడు రాధాకృష్ణ, హైకోర్టు సీనియర్ న్యాయవాది త్యాగరాజు, మాలమహానాడు అనంతపురం అధ్యక్షులు పుష్ప మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 90 లక్షల మంది మాలల జనాభా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో 21 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు, ముగ్గురు మంత్రులు ఉన్నారని చెప్పారు. ఆలూరు తాలూకాలో 24 వేల ఓటర్లు ఉన్నా వివిధ రాజకీయ పార్టీలు మాలలకు సరైన ప్రాధాన్యత ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు మాలలను గుర్తించి రాజకీయంగా ఎదిగేందుకు ఐక్యం కావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇస్తే కర్నూలు పార్లమెంట్ నుంచి పోటీ చేయడానికి దామోదరం సంజీవయ్య మనువడు రాధాకృష్ణ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గేయ, రచయిత రంగస్వామి పాడిన సిడిని నాయకులతో ప్రారంభించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది మాట్లాడుతూ... తాలూకాలో దళితులపై దాడులు, అత్యాచారాలు, మానభంగాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. మాలలు చైతన్యమయి హక్కులను కాపాడుకుంటూ సమస్యలపై పోరాడి సాధించుకోవాలన్నారు. ఎంపిపి రంగమ్మ, వైసిపి నాయకులు ఉమాంబ, కమ్మరిచేడు వీరేష్, మొలగవల్లి నాగరాజు, వన్నూరప్ప, గోపాల్, భరత్, మల్లయ్య, వీరభద్ర, వెంకటేష్, రామాంజి, ఈరన్న పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నాయకులు

ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం జగన్‌కే సాధ్యం

- వైసిపి ఇన్‌ఛార్జీ నారాయణ స్వామి

ప్రజాశక్తి - హోళగుంద

ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో జగన్మోహన్ రెడ్డికి ఎవరూ సాటికారని వైసిపి ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక వైసిపి నాయకులు తోక వెంకటేష్ ఇంట్లో జరిగిన ఓ శుభకార్యానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీలను నెరవేరుస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో నాడు-నేడు కింద ప్రతి పాఠశాలనూ అభివృద్ధి చేస్తున్నారని, విద్యార్థులు బడి మానేయకుండా 'అమ్మ ఒడి' పథకాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజలు మరోసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలనుకుంటున్నారని తెలిపారు. ఆలూరు, హోళగుంద మండల కన్వీనర్లు వీరేశ్, షఫీవుల్లా, వైసిపి నాయకులు వందవాగిలి మల్లికార్జున, ఈసా, శేషప్ప, ఎల్లార్తి దర్గన్న పాల్గొన్నారు.



గుమ్మనూరు సోదరులను సన్మానిస్తున్న నాయకులు

మతసామరస్యానికి ప్రతీక

- నేటి నుంచి శ్రీజగద్గురు ఖాదర్ లింగస్వామి ఉరుసు ఉత్సవాలు

ప్రజాశక్తి - కౌతాళం

ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు మండలమైన కౌతాళంలో వెలిసిన శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి ఉరుసు ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయని దర్గా ధర్మకర్త శ్రీసయ్యద్ మున్నా పాషా సాహెబ్ తెలిపారు. స్వామివారి 319వ ఉరుసు సందర్భంగా వచ్చే భక్తులకు స్వామివారి దర్శనం, విడిది, తాగునీరు, భోజనం వసతులు కల్పిస్తున్నట్లు బుధవారం చెప్పారు.

మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి ఉరుసు ఉత్సవాలకు ఆంధ్ర నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. 1న గంధం, 2న ఉరుసు ఉత్సవాలు, 3న ఫకీర్ సాబ్ ఫాతేహాలు, 4న జియారత్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ధర్మకర్త తెలిపారు. ఇప్పటికే విద్యుద్దీపాల అలంకరణతో దర్గా ఆవరణమంతా ముస్తాబైంది.



స్వామి వారి చరిత్ర : శ్రీజగద్గురు ఖాదర్ లింగస్వామి అసలు పేరు అబ్దుల్ ఖాదర్ జిలాని. ఈయన కర్ణాటకలోని బీదర్ జిల్లా బాపుర గ్రామంలో జన్మించారు. గుల్బర్గా దర్గా వంశస్తుల వద్ద 12 ఏళ్లు శిష్యరికం చేసి, గురువుల ఆజ్ఞ మేరకు కౌతాళం చేరుకున్నారు. అప్పట్లో ఇక్కడ మూఢచారాలు అధికంగా ఉండేవి. ఆయన కులమతాలకు అతీతంగా మూఢచారాలను దూరం చేసి లింగాన్ని ధరించి మత సంరక్షణ చాటి చెప్పారు. ప్రత్యేక ఉరుసు ఉత్సవాలకు ప్రభుత్వం నుంచి కొంత నగదును ప్రకటించడం కూడా జరిగింది.

అధికారులు సహకరించాలి : శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి ఉత్సవాలకు రెవెన్యూ, పోలీసు, విద్యుత్ శాఖ, పంచాయతీ శాఖల అధికారులు సహకరించాలని ధర్మకర్త సయ్యద్ మున్నా పాషా సాహెబ్ కోరారు. ఆదోని, సిరుగుప్ప, బళ్లారి, రాయచూర్ పట్టణాల నుంచి ఆర్‌టిసి యాజమాన్యం ప్రత్యేక బస్సులు నడిపించాలని తెలిపారు. అధికారులు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఉరుసు ఉత్సవాలకు ముస్తాబైన దర్గా

అనారోగ్యంతో టిడిపి సర్పంచి లక్ష్మన్న మృతి

- నివాళులర్పించిన టిడిపి ఇన్‌ఛార్జి కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి-ఆలూరు



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కోట్ల సుజాతమ్మ

మండలంలోని పెద్ద హోతూరు సర్పంచి జొహరాపురం లక్ష్మన్న (75) బుధవారం తెల్లవారు జామున అనారోగ్యంతో మృతి చెందారు. లక్ష్మన్న 2021వ సంవత్సరంలో టిడిపి మద్దతుతో వైసిపి అభ్యర్థిపై గెలుపొందారు. టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జ్ కోట్ల సుజాతమ్మ సర్పంచి లక్ష్మన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మన్న మృతి టిడిపికి తీరని లోటని కోట్ల సుజాతమ్మ తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. లక్ష్మన్న మృతదేహానికి టిడిపి మాజీ ఇన్‌ఛార్జీలు వైకుంఠం మల్లికార్జున చౌదరి, వీరభద్ర గౌడ్, వైకుంఠం శివ ప్రసాద్, సొసైటీ మాజీ అధ్యక్షులు సౌమ్యా రెడ్డి, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి సులక్షణ రెడ్డి, కాంట్రాక్టర్ భీమప్ప, టిడిపి మండల కన్వీనర్ అశోక్ యాదవ్, ఎంపిటిసి చిన్న యాదవ్ నివాళులర్పించారు. మంత్రి జయరాం సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణ స్వామిలు లక్ష్మన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన కుటుంబాన్ని ఓదార్చారు.



లక్ష్మన్న (ఫైల్)

శ్మశానికి అదనంగా రెండెకరాల భూమి కేటాయించాలి


- మున్సిపల్ కమిషనర్‌కు కౌన్సిలర్ ఇందు వినతి

ప్రజాశక్తి - ఆదోని



రఘునాథ్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్ ఇందు

పట్టణంలోని హను మాన్ నగర్‌లో ఉన్న శ్మశాన వాటికకు అదనంగా రెండెకరాల భూమి కేటాయించాలని 41వ వార్డు కౌన్సిలర్ బి.ఇందు కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. శ్మశాన వాటిక స్థలం కొరత ఉందన్న విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. హనుమాన్ నగర్, కిల్చిన్ పేట, వాల్మీకి నగర్, బోయ గేరి, శుక్రవారం పేట ప్రాంతాల వాసులు ఈ శ్మశాన వాటికలోనే మృతదేహాలను ఖననం చేస్తున్నట్లు చెప్పారు. సుమారు 30 వేల జనాభా ఉన్న ప్రాంతంలోని ఈ శ్మశాన వాటికలో మృతదేహాలను పూడ్చిన చోటే పూడ్చాల్సిన పరిస్థితి ఉందన్నారు. స్థలం కొరత వేధిస్తోందన్నారు. ఉన్న శ్మశాన వాటికలో కూడా ముళ్లకంపలు పెరిగి పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రం చేసి మొక్కలు పెంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. శ్మశాన వాటికలో నీటి సౌకర్యం, రహదారి ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. శ్మశానం వద్ద వ్యక్తిని నియమించి ఖననం కాగానే ఆ వ్యక్తికి సంబంధించిన వివరాలను నమోదు చేసి రశీదు ఇచ్చే ఏర్పాటు చేయాలన్నారు. త్వరలోనే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ రఘునాథ్ రెడ్డి హామీఇచ్చారు. కౌన్సిలర్లు ఫయాజ్ అహ్మద్, మహేశ్వరి ఉన్నారు.





మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

పశుగ్రాసం కొరత..

- ట్రాక్టర్ గడ్డి రూ.25 వేలు
- కొనలేమంటున్న పాడి రైతులు
- అకాల వర్షాలతో తడిసి ముద్దయిన గడ్డి
- జాగ్రత్త చేసుకునేందుకు రైతులకు దక్కని అవకాశం
- ఎండు గడ్డి కొరతతో భారంగా మారిన పశుపోషణ



పశువుల మేత కోసం ట్రాక్టర్లో తీసుకెళ్తున్న వరిగడ్డి

ప్రజాశక్తి - చాగలమర్రి

అకాల వర్షాలు అన్నదాతను అన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేశాయి. ఇప్పటికే ఆరుగాలం కష్టపడి పండించిన రబీ పంట తడిసి ముద్దవ్వడంతో అన్నదాత కష్టాలు వర్ణనాతీతం. వర్షాలకు యంత్రాలతో కోత అనంతరం పొలాల్లో ఉన్న ఎండు గడ్డి మొత్తం తడిసి ముద్దవ్వడంతో రైతులకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. వ్యవసాయం సంక్షోభంలో కూరుకు పోవడంతో పాల ఉత్పత్తితోనే రైతుల జీవనం ముందుకు సాగుతుంది. తౌడు, చిట్టు వంటి దానా ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. పచ్చ గడ్డి సైతం తీవ్ర ఇబ్బందిగా మారింది. రైతులు అత్యధికంగా ఎండు గడ్డిని పశువులకు ఉపయోగిస్తారు.

చాగలమర్రి మండలంలో దాదాపు 18 వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తారు. మండలంలో పశువులు 8400 వరకూ ఆవులు, గేదెలు, ఎద్దులు ఉన్నాయి. ప్రస్తుతం వ్యవసాయంలో ఆధునిక యంత్రాలు రావడంతో వరి పంటలను మిషన్ల ద్వారా కోతలు చేయిస్తున్నారు. గతంలో కూలీలతో కోతలు, నూర్పుళ్ళు చేసినప్పుడు మండలంలో ఎండు గడ్డికి కొరత ఉండేది కాదు. మిషన్ కోతలు వచ్చిన తర్వాత ఎండు గడ్డి కొరత వేధిస్తున్న పరిస్థితి సాగుతోంది. దీంతో యంత్రాలతో కోత కోసిన తర్వాత పొలంలో పడి ఉన్న గడ్డిని జాగ్రత్త చేసి రైతులు పశువులకు వినియోగిస్తున్నారు. ఖరీఫ్‌లోనూ వర్షాలతో ఎండు గడ్డిని రైతులు పెద్దగా జాగ్రత్త చేసుకోలేని పరిస్థితి ఉంది. ప్రస్తుత రబీలో అకాల వర్షాలు విరుచుకు పడడంతో మిషన్ కోత కోసిన తర్వాత పొలాల్లో ఉన్న గడ్డి తడిసి ముద్దయిపోయింది. వర్షాలకు నేలకొరిగిన పొలాల్లో గడ్డి పని చేయని దుస్థితి నెలకొంది. ప్రతి ఏటా రెండు, మూడు పశువులు ఉన్న రైతులు రెండు ట్రాక్టర్ల ట్రక్కుల గడ్డిని నిల్వ చేసుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది.

ఎండు గడ్డి కొరత.. దిక్కుతోచని స్థితిలో పశు పోషణ..

ఎండు గడ్డి సమస్య ఏర్పడడంతో పశు పోషణపై రైతులకు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఏడాది పొడవునా పశుపోషణ ఎలాగనే ఆందోళన వారిని వెంటాడుతోంది. దాణ, పచ్చి గడ్డి కొనుగోలు చేసి పశుపోషణ చేయడమంటే పెద్ద ఎత్తున ఖర్చుతో కూడుకున్న పని. ఎండు గడ్డి ఉంటే కొంత ఖర్చు తగ్గుతుంది. ప్రస్తుతం కొన్ని చోట్ల ఎండు గడ్డి విక్రయాలు సాగుతున్నాయి. అయితే చిన్నమోపు వంద రూపాయలకు విక్రయిస్తున్నారు. ట్రాక్టర్, ట్రక్కు గడ్డి కొనుగోలు చేయాలంటే రూ.25,000 వరకు ఖర్చు అయ్యే పరిస్థితి నెలకొంది. అంత పెద్ద మొత్తంలో వెచ్చించి ఎండు గడ్డి కొనుగోలు చేసే పరిస్థితిలో రైతులు లేరు. దీంతో రెండు పశువులు ఉంటే ఒక పశువును విక్రయించే ఆలోచనల్లో రైతులు ఉన్నారు. అదే జరిగితే రైతుల జీవనంపై తీవ్ర ప్రభావం పడుతుంది. పాలతో వచ్చే ఆదాయం తగ్గిపోవడంతో చాలా కుటుంబాలను ఆర్థిక కష్టాలు వెంటాడనున్నాయి. ప్రభుత్వం టిఎంఆర్ (టోటల్ మిక్స్ దాణ) పేరుతో సబ్సిడీ ధరలకు రైతులకు అందిస్తోంది. లేకపోతే పశువులను రైతులు అయిన కాడికి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. అదే సమయంలో పాలకొరత పెరిగి ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి రానుంది. ప్రభుత్వం ముందుగానే ఎండు గడ్డి విషయంలో ప్రత్యామ్నాయాలను ఆలోచించి



వర్షాలకు గడ్డి తడవకుండా టార్పాలిన్ల పట్టలతో కప్పిన దృశ్యం

పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి



పశుగ్రాసం ధరలు మండి పోతున్నాయి. ఎండు గడ్డిని కొనే స్తోమత లేక రైతులు పశువులను అమ్ముకుంటున్నారు. బోర్ల కింద సాగు చేసిన ట్రాక్టర్ వరిగడ్డి రూ. 25 వేలు వరకు ధర పలుకుతుంది. పశుగ్రాసం లేకపోవడంతో పాల దిగుబడి కూడా తగ్గుతుంది. ప్రభుత్వం స్పందించి పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

- హుస్సేన్ షా వలి, చాగలమర్రి రైతు.

సురక్షిత నీటిని సరఫరా చేయండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సురక్షితమైన మంచి నీటిని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, ఉపాధి హామీ తదితర పనుల ప్రగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మరమ్మతులకు గురైన బోర్లకు వెంటనే రిపేర్లు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. నీరు కలుషితమై సీజన్ వ్యాధులు ప్రబలకుండా క్లోరినేట్ చేసిన నీటినే సరఫరా చేయాలన్నారు. జల జీవన్ మిషన్ కింద ప్రారంభించిన ఇంటింటి కుళాయి కనెక్షన్ పనులు వారంవారం ప్రగతి కనపడాలన్నారు. ఇంకా ప్రారంభించని పనులను వెంటనే ప్రారంభించేందుకు సంబంధిత కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో ఇంటింటికి కొళాయి కనెక్షన్ నిమిత్తం టెండర్లను పిలిచి పనులు ప్రారంభించాలని సూచించారు. పెండింగ్లో ఉన్న 116 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు మండల, సబ్ డివిజన్ల వారీగా లక్ష్యాలు కేటాయించి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మరమ్మతులకు గురైన 536 సోక్ పిట్లను మూడు రోజుల్లో పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద రోజువారి లేబర్ రిపోర్టింగ్ శాతాన్ని పెంచాలన్నారు. అమృత సరోవర్ కింద చెరువుల పునరుద్ధరణ పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఎంపీడీవో, ఏపీడీలను ఆదేశించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కింద పెండింగ్ లో ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల యూనిట్ల పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు ముమ్మరం చేయడంతో పాటు తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాధాన్యత భవనాల నిర్మాణాలకు సంబంధించి కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డ్వామా పిడి రామచంద్రారెడ్డి, డిపిఓ శ్రీనివాసులు, ఎంపిడిఒలు, ఎపిడిలు, ఈఒఆర్డీలు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

హెచ్ఎంలపై చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మన బడి నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలో గుర్తించిన పనులు పర్యవేక్షించేందుకు హాజరు కాని పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్ డిఇఒను ఆదేశించారు. బుధవారం ఆయన చాంబర్ నుండి నాడు-నేడు పనుల ప్రగతిపై జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి తో కలిసి సమీక్షించారు. డీఈవో అనురాధ, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి లలిత, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు నాడు-నేడు పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చేపట్టిన పనులకు 10 రోజుల వ్యవధిలో సమానంగా వ్యయాన్ని బుక్ చేయాలని సంబంధిత ఏజెన్సీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను ఆదేశించారు. పాఠశాలలో చాలా చోట్ల టాయిలెట్లు లెంటల్ దశలోనే ఉన్నాయని, త్వరితగతిన రూఫ్ స్థాయికి తీసుకురావడంతో పాటు టైల్స్ కొనుగోలు చేసి ఫ్లోరింగ్ పూర్తి చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న కిచెన్ షెడ్స్ మూడు రోజుల్లో పూర్తి కావాలన్నారు. ఆధార్‌ను ఆధారం చేసుకొని బడి ఈడు పిల్లల గుర్తింపు సర్వే వేగవంతం చేయాలన్నారు. పెండింగులో ఉన్న 35 శాతం సర్వేను 3 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

ఎద్దుల బలప్రదర్శన పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల రూరల్.

మండలంలోని చాబోలు గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ పున: ప్రతిష్ఠ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎద్దుల బలపదర్శన బండలాగుడు పోటీలను నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. అంతకుముందు ఆయన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. నాయకులు భోగేశ్వర రెడ్డి, ధనుంజయ, వెంకట నాయుడు, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూమా

పొగాకు రహిత జిల్లాగా మారుద్దాం

- డిఎంహెచ్ఒ డాక్టర్ ఆర్.వెంకట రమణ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాలను పొగాకు రహిత జిల్లాగా మార్చుదామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్.వెంకట రమణ తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక డిఎంహెచ్ఒ కార్యాలయం నుండి సాయిబాబా నగర్ ఆర్చి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డిఎంహెచ్ఒ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు, గుట్కా, సిగరెట్, బీడీ, తంబాకు వాడటం వలన క్యాన్సర్ వస్తుందన్నారు. క్యాన్సర్‌ను నివారించాలంటే పొగాకును నిషేధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఓ.ప్రభావతి, మెడికల్ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు. **చాగలమర్రి** : యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని మండల వైద్యాధికారి ఇమ్రాన్ కోరారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సిహెచ్ఒ రమణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ, సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు. **అవుకు** : పట్టణంలో ప్రభుత్వ వైద్య సిబ్బంది, ఐటిఐ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఉప్పలపాడు ప్రాథమిక వైద్యశాల డాక్టర్ టి.వినోద్ కుమార్, ఎంపీడీవో అజామ్ ఖాన్, ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజుల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. **ఆత్మకూర్** : బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బైర్లూటి, నల్లకాలువ, కరివేన గ్రామాలలో వైద్యాధికారి డాక్టర్ గోపాల్, డాక్టర్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. **బండి ఆత్మకూర్** : బండి ఆత్మకూరులో డాక్టర్ భావన, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్వైజర్, సిబ్బంది పాల్గొన్నారు. **బేతంచెర్ల** : మండలంలోని సిమెంట్ నగర్ గ్రామంలో హెల్త్ సూపర్వైజర్ శారద భాయ్, ఏఎన్ఎం ఫరీదాబాను ఆధ్వర్యంలో పొగాకు వాడకం వలన కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. **వెలుగోడు** : పట్టణంలో వైద్యులు కృష్ణమూర్తి, ఎంపీహెచ్ఓ శీను, హెల్త్ అసిస్టెంట్ బాలచంద్రుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్‌పి హెచ్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **గడివేముల:** గడివేముల ప్రాథమిక కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ జబీన్ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **రుద్రవరం** : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ ప్రసాద్ మాట్లాడారు. పిహెచ్‌సి వరలక్ష్మి, ఏపీఈహెచ్ నాగ ప్రసాద్, సూపర్వైజర్



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకటరమణ

నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - బనగానపల్లె

నందివర్గం గ్రామా సమీపంలోని పలుకూరు క్రాస్ రోడ్ వద్ద ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి 30 లీటర్ల నాటసారను స్వాధీనం చేసుకున్నట్లు నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డి బుధవారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ అవుకు మండలం కొండమనాయునిపల్లె గ్రామానికి చెందిన కోనేటి సుబ్బయ్య, కోలుకొండ వెంకటేష్, కోలుకొండ రమణలు మోటార్ సైకిల్ పై 30 లీటర్ల నాటు సారాను తీసుకొస్తుండగా పట్టుకొని అరెస్టు చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాయలసీమపై స్పష్టమైన హామీలివ్వాలి

- రాయలసీమ సాగునీటి సాధన సమితి

ప్రజాశక్తి - కొత్తపల్లి

ప్రస్తుతం అధికార, ప్రతిపక్షంలో ఉన్న రాజకీయ పార్టీల నేతలు అమరావతి సమస్య కాదు రాయలసీమపై స్పష్టమైన హామీ ఇవ్వాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథ రామిరెడ్డి తెలిపారు. బుధవారం కొత్తపల్లి మండలం సంగమేశ్వరం వద్ద సిద్దేశ్వరం జల జాగరణ దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న ముఖ్యమంత్రులు రాయలసీమ వాసులైనా సీమ ప్రాంతాన్ని ఎడారిగా మార్చేసిన ఘనత ఉందన్నారు. సీమ ప్రాంతం నుంచి అన్ని వనరులను దోచుకుపోతున్నారే తప్ప అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. సిద్దేశ్వరం అలుగు రాయలసీమకు వెలుగు లాంటిదని అన్నారు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణం కోసం అనేక పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న రాజకీయ పార్టీలు రాయలసీమ అభివృద్ధిని మరచి ఇతర ప్రాంతాల అభివృద్ధికి ముందుకు సాగడం బాధాకరమన్నారు. సీమలో సాగు, తాగునీరు లేక రైతులు, ప్రజలు అల్లాడుతున్నా ఎవరు కూడా పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో రాయలసీమ సమస్యల ఊసే లేదని,సీమ సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు అరుణ్, రైతులు కాసిం, చిన్న రమణారెడ్డి, బస్తిపాడు రామకృష్ణారెడ్డి, డాక్టర్ బ్రహ్మారెడ్డి, రత్నం, ఏసేపు, హరినాథ్ రెడ్డి, రాజశేఖర్, మహేశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర్లు నాయుడు, పినాకపాని, రామిరెడ్డి, సుధాకర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు



నిరాధార ఆరోపణలు ఆవేదన కలిగించాయి

- భూమా అఖిలప్రియ తప్పు చేసినందుకే అరెస్టు చేశారు
- టిడిపి సీనియర్ నాయకుడు ఎవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మాజీ మంత్రి భూమా అఖిలప్రియ తనపై నిరాధార ఆరోపణలు చేయడం బాధ కలిగించిందని టిడిపి సీనియర్ నాయకుడు ఏవి సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువగళం పాదయాత్రలో భాగంగా నంద్యాల మండలం కొత్తపల్లి వద్ద జరిగిన సంఘటనలో భూమా అఖిల ప్రియ చేసిన దాడిలో తనకు గాయాలు అయ్యాయని పోలీస్ స్టేషన్లో తగిన ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో అఖిల ప్రియపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారన్నారు. అయితే భూమ అఖిల ప్రియ కూడా తనపై పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారని, కానీ మహిళా సమాజం సిగ్గుపడేలా తండ్రి లాంటి వయసు ఉన్న తాను ఆమె చున్ని లాగి హత్యాయత్నం చేసినట్లు ఫిర్యాదు చేయడం బాధను కలిగించిందన్నారు. ఆధారాలు లేకుండా ఫిర్యాదు చేయడం మంచిది కాదన్నారు. అఖిలప్రియ విధానాల వల్ల కుటుంబ సభ్యులే దూరమవుతున్నారని తెలిపారు. తాను దాడి చేసినట్లు ఆధారాలు చూపించాలన్నారు. పలుచోట్ల



విలేకరులతో మాట్లాడుతున్న ఏవి సుబ్బారెడ్డి

అక్రమాలకు, భూ కబ్జాలకు అఖిలప్రియ పాల్పడినట్లు తెలిపారు. భూమా అఖిలప్రియను జైలుకు పంపించడం వెనుక వైసిపి నాయకుల హస్తం ఉందని తనపై ఆరోపణలు చేయడం సరైనది కాదన్నారు. తనను హత్య చేయడానికి భూమా అఖిలప్రియ సుపారీ ఇచ్చిన కేసులో సిఎం జగన్‌ను కలిసి కేసు కొట్టేపించుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. భూమా అఖిలప్రియ బంధువులు అప్పు చెల్లించాలని ఇంటి ముందు నిరసన వ్యక్తం చేశారని, తల్లి తండ్రి నుంచి రాజకీయ వారసత్వం ఆశించినప్పుడు వారి అప్పులు కూడా కట్టాల్సిన బాధ్యత లేదా అంటూ నిలదీశారు. యువగళం పాదయాత్ర ఆళ్లగడ్డలో విజయవంతం కావడానికి టిడిపి కార్యకర్తలు లోకేష్‌పై ఉన్న అభిమానంతో వచ్చారని, నిన్ను చూసి ఎవరు రాలేదని విమర్శించారు. ఎన్నికలలో ఆళ్లగడ్డ, నంద్యాలలో పార్టీ ఆదేశిస్తే పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. భూమా నాగిరెడ్డి బ్రాండ్ వెనుక ఏవి సుబ్బారెడ్డి పాత్ర ఉందన్నారు. తనను దేవుడిచ్చిన వరమని ఒక బహిరంగ సభలో భూమా నాగిరెడ్డి చెప్పలేదా... ఇద్దరం ఒకటే అనుకున్నాం, ఒకరి క్షేమం ఒకరం చూసుకుంటూ వచ్చాము కాబట్టే 24 కేసులు నాపై పెట్టారని తెలిపారు. గంగుల, ఇరిగెల కుటుంబాలకు నాకు వ్యక్తిగతంగా గొడవలు లేవని, భూమా వెంట ఉన్న కాబట్టే వారికి వ్యతిరేకిగా ఉన్నానన్నారు. టిడిపి నంద్యాల ఇంఛార్జి భూమా బ్రహ్మానందరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్సీ ఎన్ఎండి ఫరూక్‌లు కార్యక్రమాలకు పిలిస్తే తప్పకుండా వస్తానన్నారు. రాజకీయాలు చేయాలి కానీ దిగజారుడు రాజకీయాలు చేయొద్దని అఖిల ప్రియకు హితవు పలికారు.



క్రీడాకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

అన్ని వసతులూ కల్పిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు అన్ని వసతులూ కల్పిస్తామని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తెలిపారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడా ప్రాంగణంలో ఇండోర్ స్టేడియంకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డిలు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రీడాకారులతో, సీనియర్ సిటిజన్‌తో మాట్లాడారు. ఆత్మకూరు క్రీడాకారులకు పుట్టినిల్లు లాంటిదని, భవిష్యత్తులో క్రీడా ప్రాంగణంలో అన్ని వసతులతో కల్పిస్తామని క్రీడాకారులకు భరోసా కల్పించారు. క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్వీర్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఆసియా, ఎంపిపి నల్లకాల్వ తిరుపాలమ్మ, జడ్పిటిసి శివ శంకర్ రెడ్డి, పువ్వాడ భాస్కర్, కౌన్సిలర్లు సుల్తాన్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా సిఐటియు

ప్రజాశక్తి - గడివేముల

కార్మికులకు అండగా నిలిచే సంఘం సిఐటియు అని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జి నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు ఏళ్ల సుబ్బయ్యలు తెలిపారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం గడివేముల బస్టాండ్ ఆవరణంలో ఆటో స్టాండ్ దగ్గర ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు మండల సహాయ కార్యదర్శి శివుడు అధ్యక్షతన జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక చట్టాలు కాల రాస్తే పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సామన్న, రాంబాబు, గోకార్‌సా, చెన్నారెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

క్రికెట్ పోటీలతో వెలుగులోకి ప్రతిభ : వైసిపి

ప్రజాశక్తి - బనగానపల్లె

గ్రామీణ ప్రాంతాల యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వైసిపి మైనార్టీ నాయకులు అత్తార్ జాహీద్ హుస్సేన్ తెలిపారు. బుధవారం మండలంలోని నందవరం గ్రామంలో చౌడేశ్వరి దేవి క్రికెట్ టోర్నమెంట్ సమ్మర్ క్రికెట్ పోటీలను వైసిపి మైనార్టీ నాయకులు అత్తార్ జాహీద్ హుస్సేన్, కాటసాని ఓబుల్ రెడ్డి యూత్ సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని, నేటి ఓటమి రేపటి గెలుపుకు నాందిగా స్వీకరించాలన్నారు. క్రీడలతో స్నేహభావం పెరుగుతుందన్నారు. క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలన్నారు. దివంగత కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వైసిపి యువ నాయకులు కాటసాని ఓబుల్ రెడ్డి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక, క్రీడా పోటీలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.20 వేలు కాటసాని ఓబుల్ రెడ్డి, రెండవ బహుమతి రూ.10 వేలు వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, మూడవ బహుమతి రూ.5 వేలు పట్టణానికి చెందిన లాయర్ నాగేశ్వర్ రెడ్డి, నాలుగో బహుమతి రూ. 3 వేలు నాగమద్దిలేటి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబుల్ రెడ్డి యూత్ సభ్యులు పాపిరెడ్డి సుదర్శన్ రెడ్డి, అంబటి రవికుమార్ రెడ్డి, మమ్ముదా, అత్తార్ అఖిల్ హుస్సేన్, క్రికెట్ నిర్వహకులు కే.బాలు, పరుగు, హరి గోవింద, నందు, నాని, క్రీడాకారులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న అత్తార్ జాహిద్ హుస్సేన్

పాము కాటుతో ఉపాధి కూలీకి తీవ్ర అస్వస్థత

ప్రజాశక్తి- చాగలమర్రి

మండలంలోని కదిరిపురం తండాకు చెందిన ఉపాధి కూలీ ఓం శివనాయక్‌ను బుధవారం పనుల వద్ద పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఓం శివనాయక్ గ్రామం సమీపంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో భాగంగా కాలువలో మట్టిని తీస్తున్న సమయంలో పాము కాటు వేసింది. శివ నాయక్ కేకలు వేయడంతో గమనించిన తోటి ఉపాధి కూలీలు అతడిని హుటాహుటిన స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు.

గురుకుల ఎంట్రెన్స్ ఫలితాల్లో మోడల్ విద్యార్థికి మొదటి ర్యాంకు


విద్యార్థి వర్షిత్

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మోడల్ స్కూల్ విద్యార్థి వర్షిత్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల రాష్ట్రస్థాయి (ఐఐటి, ఎన్ఐటి, నీట్) ఎంట్రన్స్ పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించాడు. పాములపాడు మండలం కృష్ణరావు పేట గ్రామానికి చెందిన పసుపుల వర్షిత్ రాష్ట్రస్థాయి ఎంట్రెన్స్‌లో ప్రతిభను కనబరిచి 46/60 మార్కులు సాధించాడు. ఈ ఎంట్రన్స్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో 26 జిల్లాల నుండి విద్యార్థులు 3 వేల మంది దాకా పోటీలో పాల్గొంటారు. పాములపాడు మోడల్ స్కూల్‌లో చదివి రాష్ట్ర మొదటి ర్యాంకు సాధించడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ నాగ రవీంద్రుడు, ఉపాధ్యాయులు వర్షిత్‌ను అభినందించారు

పాత బట్టువారిపల్లిలో పులి సంచారం

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలోని పాత బట్టువారిపల్లి గ్రామ శివారులో ఉన్న సుంకులమ్మ ఆలయం సమీపంలో బుధవారం ఉదయం పులి సంచరించింది. పులిని చూసిన యువకుడు భయంతో పరుగులు తీసి చూసిన సమాచారాన్ని గ్రామస్తులకు తెలిపారు. గ్రామస్తులంతా కలిసి సంబంధిత ఫారెస్ట్ అధికారులకు తెలియజేశారు. ఫారెస్ట్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పులి కనిపించిన ప్రదేశానికి ముసలమడుగు ఫారెస్ట్ అధికారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో వెళ్లి పరిశీలించారు. అయితే అప్పటికే ఆ ప్రదేశంలో గ్రామానికి చెందిన పశువులు వెళ్లడంతో పాదముద్రలు కనిపించలేదని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. గ్రామస్తులు ఏదైనా అన్నవాలు కనిపిస్తే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వాలని, గురువారం ఉదయం కూడా గాలింపు చర్యలు చేపడతామని తెలిపారు.

ఆవులను రోడ్లపైకి వదలరాదు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం మండలం సున్నిపెంట గ్రామంలోని గోవులను వాటి యజమానులు రోడ్లపైకి, దుకాణాల వైపు వదలరాదని ఎంపిడీవో కృష్ణమోహన్, తాసిల్దార్ రాజేంద్ర సింగ్, సీఐ దివాకర్ రెడ్డి, ఎస్ఐ గంగయ్య యాదవ్ హెచ్చరికలు జారీ చేశారు. బుధవారము సుండిపెంటలోని రెండవ పట్టణ అవుట్ పోస్టు పోలీస్ స్టేషన్‌లో గోవుల యజమానులను పిలిపించి మాట్లాడారు. ఎవరి ఆవులను వారు ఇంటి వద్దనే కట్టేసుకోవాలని, రహదారుల వెంట తిరుగుతూ ప్రజలను, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. బయటికి అలాగే వదిలితే అవసరమైతే గోవుల యజమానులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


అవులను రోడ్లపైకి వదలరాదని యజమానులకు హెచ్చరిస్తున్న అధికారులు

చెంచులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - ఆత్మకూరు

కొత్తపల్లి మండలం బలపాలతిప్పకు చెందిన చెంచు గిరిజనులపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు జవహర్ నాయక్ కోరారు. బధవారం ఐటిడిఎ పిఒ రవీంద్రా రెడ్డితో కలిసి ఆయన ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న గిరిజనులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల ముందు చెంచు గిరిజనులు పోయే దారిలో చేపల వల ఎందుకు కట్టారని గిరిజన యువకుడు బాలస్వామి తిట్టాడని మంగళవారం రాత్రి 9 గంటలకు అమాయకులైన చెంచు గిరిజనుల ఇండ్ల వద్దకు వచ్చి దాడి చేయడం దారుణమన్నారు. అర్ధరాత్రి 1.45 నిమిషాలకు అంబులెన్స్‌లో చెంచు గిరిజనులను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారని తెలిపారు. చికిత్స పొందుతున్న వారిలో నిమ్మల బాలయ్య పరిస్థితి విషమంగా వుందన్నారు. మహిళలకు తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. గిరిజన కుటుంబాలపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐటిడిఎ పిఒ బాధిత చెంచు గిరిజనులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. వారి ఖర్చులకు రూ. 5 వేలు అందజేశారు. అనంతరం చెంచు గిరిజనులు డాక్టర్ దగ్గర ఎంఎల్‌సి రిపోర్ట్ తీసుకుని కొత్తపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


బాధితులను పరామర్శిస్తున్న ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

ప్రజాశక్తి - బనగానపల్లె

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని గ్రంథాలయ అధికారి జలాల్ బషీర్ అహ్మద్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం


బనగానపల్లె : విద్యార్థులకు సూచనలు చేస్తున్న గ్రంథాలయ అధికారి జలాల్ బషీర్ అహ్మద్

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయ అధికారి పర్యవేక్షణలో ప్రభుత్వం విద్యాభివృద్ధికి విద్యార్థుల భవిష్యత్తు కోసం చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుండే గ్రంథాలయాలు ఉపయోగించుకోవా లన్నారు. గ్రంథాలయాలలో ఉపయోగపడే ఎన్నో పుస్తకాలు ఉన్నాయని, వాటి ద్వారా జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. చరవాణికి స్వస్తి చెప్పాలన్నారు. పుస్తక పఠనం ద్వారానే జ్ఞాన అభివృద్ధి సాధ్యమన్నారు. పిల్లల తల్లిదండ్రులు గ్రంథాలయాల ఆవశ్యకతను గుర్తించి భవిష్యత్తుకు గ్రంథాలయాలపై చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఖలీల్ అహ్మద్, మదన్ మోహన్ రెడ్డి, పాఠకులు పాల్గొన్నారు. **పగిడ్యాల :** పుస్తకాలే మంచి స్నేహితులని, వాటినిచదివినప్పుడే మంచి విజ్ఞానం పొందవచ్చని గ్రంథాలయ అధికారిని కే మద్దమ్మ, బ్రాహ్మణకొట్కూరు బీఇడీ కళాశాల లెక్చరర్ సురేష్ నాయుడు తెలిపారు. పగిడ్యాల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు ఎక్కువ సమయాన్ని వృధా చేయకుండా పుస్తకాలు చదవాలన్నారు. అనంతరం తెలుగు గ్రామర్, తెలుగు వ్యాస రచన గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం వివిధ రకాల ఆటలు పాటలు విద్యార్థులతో ఆడించారు.


పగిడ్యాల : తెలుగు గ్రామర్ చదివిస్తున్న గ్రంథాలయ అధికారిణి

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని ఆయ సచివాలయాల పరిధిలోని జగనన్న కాలనీలోని గృహ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. నిర్మాణ పనులు చేపట్టిన వారికి బిల్లులు సక్రమంగా సరైన సమయానికి ఖాతాలో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

పిహెచ్‌సిని తనిఖీ చేసిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎంహెచ్ఒ వెంకటరమణ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యశాలలోని రికార్డులను పరిశీలించారు. వైద్యశాలకు సంబంధించిన సమాచారాన్ని డాక్టర్ శివ శంకరుడును అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఉద్దేశంతో గ్రామ సచివాలయ పరిధిలో హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసిందని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎం,లు హెల్త్ సెంటర్లలో


రికార్డులను తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ

అందుబాటులో ఉండాలని సూచించారు. నూతనంగా నిర్మించిన వైద్యశాల భవనాన్ని పరిశీలించి ఎమ్మెల్యే సహకారంతో త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం డాక్టర్ శివశంకరుడు ఆధ్వర్యంలో ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మాతృ మరణాలు తగ్గించాలని, గర్భవతులకు, బాలింతలకు రక్తహీనత లేకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు వారికి అవసరమైన పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్స్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

వైసిపి నాయకులకు గుణపాఠం చెబుతాం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం అనే పేరుతో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ చంద్రబాబు, లోకేష్‌లను పల్లకిలో మోస్తున్నట్టు చిత్రీకరించిన బ్యానర్లను పట్టణంలో వైసిపి నాయకులు ఫ్లెక్సీలు కట్టడాన్ని జనసేన ఆళ్ళగడ్డ తాలుకా నాయకులు మైలేరి మల్లయ్య తీవ్రంగా ఖండించారు. ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని, తొలగించని పక్షంలో వైసీపీకి వ్యతిరేకంగా జనసేన తరఫున మేము కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామని ఆళ్ళగడ్డ టౌన్ ఎస్ఐ తిమ్మయ్యకు బుధవారం వినతి పత్రం అందజేశారు. అలాగే కమిషనర్ లేకపోవడంతో సిబ్బందికి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 2024లో జరిగే ఎన్నికల్లో వైసిపి నాయకులకు సరైన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఆళ్ళగడ్డ వైసీపీ నాయకుల ఎర్ర మట్టి దందా, ఇసుక దందా, మార్కెట్ యార్డ్‌లో గోనె సంచుల దందా, అలాగే గేటు వసూళ్ల దందాల గురించి జనసేన పార్టీ తరపున తాము కూడా ఫ్లెక్సీలు వేయగలమని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మాబు హుస్సేన్, కోటి, వెంకటసుబ్బయ్య, రమణాచారి, కుమ్మరి నాగేంద్ర, రాము, బ్రహ్మేంద్ర కుమార్, ప్రతాప్, విజయ్, కమాల్ భాష, కేశవ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు 7 వరకు గడువు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం ఆదర్శ పాఠశాల, కళాశాల లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 7 చివరి తేదీ అని ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పాసైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో జూన్ 7వ తేదీలోపు దరఖాస్తు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం 9849215838 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

చీరలు పంపిణీ

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

కోవెలకుంట్లలోని రోటరీ క్లబ్ భవనంలో మహావీర్ రాణా ప్రతాప్ సింగ్ జయంతి సందర్భంగా రోటరీక్లబ్ ప్రెసిడెంట్, జాతీయ బీసీ జన సంక్షేమ సంఘం అధ్యక్షులు బాలాజీ సింగ్ సొంత నిధులతో స్వచ్ఛభారత్, గ్రామ పంచాయితీ మహిళలకు, పొదుపు లక్ష్మి పేద మహిళలకు చీరలను ఉప సర్పంచి జిసిఆర్ సూర్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ నాగేశ్వర్ రెడ్డి, రోటరీ క్లబ్ మాజీ ప్రెసిడెంట్ మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ బాల ఆంజనేయ రెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


చీరలు పంపిణీ చేస్తున్న జిసిఆర్ సూర్యనారాయణ రెడ్డి

దళిత యువకుడి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ఆత్మకూరు పట్టణంలో అనుమానాస్పదంగా దళిత యువకుడు దివాకర్ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు నమ్మించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్‌లు డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. దివాకర్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాములపాడు : మండలంలోని కృష్ణారావు పేట గ్రామానికి చెందిన రాజేష్(46) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. వైయస్సార్ బీమా పథకం కింద తక్షణ సహాయంగా కుటుంబ సభ్యులకు రూ.10 వేలు సర్పంచి వనమాల ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి కళ్యాణ్, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీలక్ష్మి అందజేశారు.

సబ్ ఇంజనీర్‌కు సన్మానం

ప్రజాశక్తి - గడివేముల : గడివేములలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సబ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తూ విరమణ పొందిన రంగరాజును బుధవారం తోటి సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నంద్యాల డివిజన్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ రమణారెడ్డి. ఏడిఈ సతీష్ కుమార్ రెడ్డి. ఏఈ రవి కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : జిల్లాలో నకిలీ విత్తనాలు అమ్మినా, అధిక ధరలకు అమ్మినా కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు, మండల వ్యవసాయ అధికారి స్వప్నిక వ్యాపారులను హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని బస్టాండ్ ఏరియాలో ఉన్న విత్తన అంగళ్లను వ్యవసాయ అధికారి స్వప్నికతో కలిసి విజిలెన్స్ ఎంఫోర్స్మెంట్ అధికారులు సిఐ కేశవరెడ్డి, సిబ్బంది సిద్దయ్యలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను బిల్లులను పరిశీలించారు. రైతులు కొన్న విత్తనాలకు రసీదులు ఇవ్వాలని తెలిపారు.

మాజీ ఎమ్మెల్సీని కలిసిన సిఐ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డిని ఆయన స్వగృహంలో పట్టణ సిఐ రమేష్ బాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఐను మాజీ ఎమ్మెల్సీ ఆప్యాయంగా పలకరించారు. విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

బాధితుడి కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - గడివేముల : గడివేములలోని బిలకల గూడూరు రహదారిలో ఉన్న ఎరుకల కాలనీలో ఉన్న అనురాత్ (6) మెరుపుల శబ్దానికి పిడుగుపడి చనిపోయిన విషయం తెలుసుకొని బుధవారం టిడిపి నంద్యాల జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు గౌరు వెంకట రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు దేశం సత్యనారాయణ రెడ్డి, రమణారెడ్డి, గఫూర్, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.



సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనే ధ్యేయం

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు

ప్రజాశక్తి - శ్రీశైలం

ఐక్యరాజ్య సమితి (ఐరాస) నిర్దేశించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. బుధవారం శ్రీశైలంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సామాజిక, ఆర్థిక అంశాల్లో బలమైన మార్పు తీసుకువచ్చేలా సిఎం నిర్ణయాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా నవరత్నాల కార్యక్రమాలను పకడ్బందీగా అమలు పరుస్తున్నట్లు వెల్లడించారు. ప్రధానంగా పిల్లలలో రక్తహీనత, పౌష్టికాహార లోపం, పాఠశాలల్లో డ్రాప్ అవుట్లను తగ్గించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించినట్లు వివరించారు. చదువుకునేందుకు ఎక్కువ మంది పిల్లలను పాఠశాలకు రప్పించడం కోసం అమ్మ ఒడిని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు.

కుట్రలు, మోసాలకు మారుపేరు బాబు

నమ్మకానికి సిఎం జగన్ బ్రాండ్ అంబాసిడరైతే, కుట్రలు, కుతంత్రాలు, మోసపూరిత హామీలకు చంద్రబాబు మారుపేరని మల్లాది విష్ణు విమర్శించారు. 2003లో బాబు ముఖ్యమంత్రి ఉండగా రాష్ట్రంలో పేదరికం తాండవించిందని, ఎక్కడ చూసినా కరువు, రైతు ఆత్మహత్యలు, ఆకలికేకలు వినిపించేవని అన్నారు. ఆ సమయంలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్ర చేపట్టి ప్రజల అవసరాలకు తగినట్లుగా సంక్షేమ పాలన అందించి వారి గుండెల్లో దేవుడిలా నిలిచారన్నారు. ఆ మహానేతను కాపీ కొట్టి 2014లో చంద్రబాబు చేసిన తొలి 5 సంతకాలలో చివరకు ఏ ఒక్కటీ పూర్తిగా నెరవేర్చలేక అసమర్థ ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారన్నారు. మరలా సిఎం ఆలోచనలను అనుకరిస్తూ వైసిపి ప్రభుత్వానికి చంద్రబాబే నూటికి నూరు శాతం మార్కులు వేస్తున్నారని చెప్పుకొచ్చారు. ధైర్యం ఉంటే చంద్రబాబు, పచ్చ నేతలు మాయం చేసిన టిడిపి మేనిఫెస్టోపై చర్చకు రావాలని సవాల్ చేశారు. కర్నూలులో న్యాయ రాజధానిని వ్యతిరేకించిన నారా లోకేష్, తెలుగుదేశం నేతలు మళ్లీ ఏ ముఖం పెట్టుకుని న్యాయవాదులకు హామీలు ఇస్తారని ప్రశ్నించారు. సిఎం గూర్చి మాట్లాడే ముందు నోరు అదుపులో పెట్టుకోవాలని లోకేష్‌కు సూచించారు. లేకుంటే ప్రజాక్షేత్రంలో మరోసారి ఘోర పరాభవం తప్పదని హెచ్చరించారు.

వైభవంగా పెద్దమ్మ జాతర

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని గులాంనబిపేట గ్రామంలో పెద్దమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. పెద్దమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించి గ్రామ ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన టిడిపి నాయకుల ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి, టిడిపి యువ నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డిలు జాతరలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి జాతరలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రఘురామిరెడ్డి, వడ్డే వెంకటేష్, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.


పెద్దమ్మకు పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి


పెద్దమ్మ పూజలు నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

రాయితీలపై తెలియజేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ఉపాధి పథకంలో ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు పండ్లతోటల పెంపకంలో ఉన్న రాయితీల గురించి తెలియజేయాలని ఎంపీడీవో వాసుదేవ గుప్త సిబ్బందికి తెలిపారు. బుధవారం ఉపాధి ఏపీవోలు వసుధ, నాగార్జున ఆధ్వర్యంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న గృహ నిర్మాణం పథకంలో ఇల్లు కట్టుకున్న వారికి 90 రోజుల పని దినాలు మస్టర్లు ఇవ్వాలన్నారు. ఎన్ఎంఎస్ అప్లికేషన్ ద్వారా హాజరు పంపాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో ఈసీ వరదరాజులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


ఉపాధి హామీ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఉద్యోగులకు విరమణ తప్పనిసరి


ప్రజాశక్తి - చాగలమర్రి

ప్రతి ఉద్యోగికి విరమణ తప్పనిసరి అని ఐసిడిఎస్ మండల సూపర్ వైజర్ సుశీల అన్నారు. బుధవారం మండలంలోని చిన్న బోధనం గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ ఓబులమ్మ ఉద్యోగ విరమణ సందర్భంగా సూపర్వైజర్ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సుశీల మాట్లాడుతూ 1989లో ఉద్యోగంలో చేరి 34 సంవత్సరాలు విధులు నిర్వహించారన్నారు. విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ ఓర్పుతో, నేర్పుతో విధులు నిర్వహించి పలువురి మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, సహాయకులు పాల్గొన్నారు.

పట్టాలు రద్దు కావు : మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలో జగనన్న లే అవుట్లలో పట్టాలు పొందిన లబ్దిదారుల పట్టాలు ఎవరివీ రద్దు కావని, ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం త్వరితగతిన ఇళ్ళు నిర్మించుకోవాలనే ఉద్దేశంతో అధికారుల ద్వారా ఒత్తిడి చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం శ్రీవాసవి కళ్యాణమండపంలో చాగలమర్రి 5వ పచివాలయం వాలంటీర్, వైసిపి నాయకుడు క్రిష్ణా కూతురు బిచ్చాల కల్పన వివాహానికి ఆయన హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే మరో వైసిపి నాయకుడు బాలయ్య కుమారుడు సంతోష్ వివాహానికి హాజరయ్యారు. అనంతరం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాగలమర్రి పట్టణంలో రోడ్లు, డ్రైనేజి పనులకు ప్రభూత్వం నుండి త్వరలోనే రూ.9 కోట్లు మంజూరు కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబుబాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి ముల్లా రఫి, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మను నరసింహారెడ్డి, మల్లారెడ్డి, ఖాదర్ భాష, చక్రం బీడి షబ్బీర్, ఎంపిటిసి ఫయాజ్, షబ్బీర్, మదార్‌వలి తదితరులు పాల్గొన్నారు.


వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్సీ

మహిళలకు రక్షణ కరువు : కాంగ్రెస్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

దేశ రాజధానిలో మహిళలకు రక్షణ కరువయిందని, ఢిల్లీలో 40 రోజులుగా పోరాడుతున్న రెజ్లర్ల సమస్యను పట్టించుకోకపోవడం నరేంద్ర మోడీ నియంతృత్వానికి పరాకాష్ట అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు జె. లక్ష్మి నరసింహ విమర్శించారు. బుధవారం నంద్యాలలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీ వేదికగా రెజ్లర్లు గొంతెత్తి అరుస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దేశ రాజధాని ఢిల్లీలో మహిళకు భద్రత కల్పించకపోగా భారత మహిళా రెజ్లర్లపై పోలీసుల దాడులు, అనంతరం వారిపై నమోదు చేసిన కేసులపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ప్రారంభోత్సవం సంధర్భంగా ప్రతిష్ఠించిన చారిత్రాత్మక 'సెంగోల్ (రాజదండం)' తొలిరోజే వంగిపోయిందని ఎద్దేవా చేశారు. తక్షణమే భారత రెజర్లపై అన్యాయంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

పర్యావరణ జీవన శైలిపై అవగాహన

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : మండలంలోని పి.నాగిరెడ్డి పల్లె గ్రామంలో పర్యావరణ జీవన శైలిపై ప్రజలకు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కసారి వాడిన ప్లాస్టిక్‌ను ఉపయోగించవద్దని, నీటిని వృధా చేయవద్దన్నారు. కలుషితం చేయవద్దని, ఎలక్ట్రానిక్ వృధాను తగ్గించా లన్నారు. వ్యవసాయంలో డ్రిప్ విధానం, స్థిరమైన ఆహార వ్యవస్థ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బిఓ నాగేంద్రయ్య, నూతల సౌత్ బీట్ గార్డు తదితరులు పాల్గొన్నారు.

ఎండ వేడిమికి జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ప్రస్తుతం ఉన్న ఎండలకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సమాజ సేవకుడు మర్రిపల్లె అబ్దుల్ గఫార్ ఆటో యాత్ర ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఆళ్లగడ్డ మండలంలోని పలు గ్రామాలలో ఎండలపై ప్రత్యేకమైన జాగ్రత్తలు వహించాలని కోరుతూ ఆయన బుధవారం ఆటో యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, పిల్లలు బయటకు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వివాహ వేడుకల్లో ప్రముఖులు

ప్రజాశక్తి - బేతంచెర్ల : బేతంచర్ల పట్టణంలోని సంజీవ్ నగర్ కాలనీలో మురళీధర్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన పాపసాని నారాయణరెడ్డి కుమారుడు వివాహ వేడుకల్లో టిడిపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం పిడతల రూబిన్ నూతన గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి, నాయకులు ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి, రాష్ట్ర టిడిపి కార్యదర్శి వలసల రామకృష్ణ, డోన్ నియోజకవర్గం గౌరవ సలహాదారుల సంఘం అధ్యక్షుడు మురళి కృష్ణ గౌడ్, పోలూరు రాఘవరెడ్డి, బుగ్గన ప్రసన్న లక్ష్మి, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, రాష్ట్ర క్రిస్టియన్ కమిటీ కార్యదర్శి మేకల నాగరాజు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి రవీంద్ర నాయక్, రమేష్ రెడ్డి, నారాయణ స్వామి, కౌన్సిలర్స్ రామ్ గోపాల్, రామాంజనేయులు, టైలర్ రాముడు, ఆవుల రామకృష్ణ, శ్రీధర్ , బాలరాజు కానాల అంజి పాల్గొన్నారు.


పలు శుభకార్యాల్లో పాల్గొన్న టిడిపి డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి తదితరులు